



“ఏమండీ! కాఫీ...” భార్యామణి అరుపు లాంటి పిలుపు విని ఉలికిపాటుతో ముసుగు తీసాడు దివాకరం... భార్య అరవిందం ముఖారవిందాన్ని చూసి కెవ్వుమని అరిచాడు.

“ఏమయ్యింది?” అన్నట్లు ముఖంలో క్వశ్చన్మార్క్ పెట్టింది భార్య.

“పొద్దున్నే నీ ముఖం చూసాను కదా!” అన్నాడు దివాకరం మెల్లగా!

“చాల్లెండి వెటకారం! ప్రతిరోజూ మీ ముఖాన్నే అద్దంలో చూస్కుంటున్నారుగా? ఏం లాభం...?” అంది అరవిందం కోపంగా!

# గ్రహబలం

దివాకరం మరేం మాట్లాడకుండా ఒక్క గుక్కలో కాఫీ త్రాగేసి నోట్లో బ్రష్ వేసుకున్నాడు. బ్రష్ చేసుకుంటూ పేపర్ తెరిచాడు. తన కిష్టమయిన పేజీ కొరకు కన్నులు ఆత్రంగా వెదికాయి.

అదే... గ్రహబలం... తన రాశిఫలాల వెంట కనులు, మనసూ పరిగెత్తాయి.

"బంధు మిత్రులతో విందు వినోదాల కాలక్షేపం, వాహనయోగం, వ్యాపారస్తులు, భాగస్వాముల విషయంలో జాగ్రత్త అవసరం. ఆరోగ్యం సంతృప్తికరం. ఆర్థికలాభం. రాజకీయరంగంలోని వారికి కుట్రలు తప్పవు. స్త్రీసౌఖ్యం".

మళ్లీ యింకోమారు జాగ్రత్తగా చదివాడు.

'ఈ వేళ ఫలితాలు చాలా బావున్నాయి. ఈ ఫలితాలు వ్రాసిన వాడెవ్వడో గొప్ప మేధావి అయివుంటాడు అని నిర్ణయానికి వచ్చాడు. ఎందుకంటే ఆ రోజు తన కొలీగ్ పరాంకుశం వాళ్ల అబ్బాయికి మెడిసిన్‌లో సీటు వచ్చిందని అందరికీ పార్టీ యిస్తున్నాడు. పైగా ఈ రోజు హాఫ్‌డే... మధ్యాహ్నం లంచ్ అయ్యాక చతుర్ముఖ పారాయణం. అంటే... బంధుమిత్రులతో విందు వినోదాల కాలక్షేపం అన్న మొదటి పాయింట్ నిజం అవుతుందన్నమాట. యిక మిగిలిన విషయాల సంగతి చూద్దాం.

వాహన యోగం. యిది తనను చాలా రోజులుగా వేధిస్తున్న సమస్య... తీరని కోరిక. టూవీలర్ కొనుక్కుందామని ఎన్నిసార్లు డబ్బు ఏర్పాటు చేసుకున్నా... తీరా ఏదో అవసరం దాన్ని మ్రింగేస్తోంది. ఏం చేస్తాం? మధ్యతరగతి బ్రతుకులు. గొప్పగా బ్రతకాలని ఆశలు... కాళ్లు కూడా సరిగా చాపుకోవడానికి వీలుకాని యిల్లు... రెంటికీ మధ్య నలుగుతూ సతమతం కావడమే...!

వ్యాపారస్థులు - భాగస్వాములు... యిది మనకు సంబంధం లేని విషయం. ఇక ఆరోగ్యం సంతృప్తికరం - చల్లనిమాట... ఎందుకంటే మనం తినే ప్రతీదీ కూడా మెడికేటెడ్... నివసించే పరిసరాలు పొల్యూటెడ్... యిక రోగాలకేం కొదవ... ఈగలు వాలినట్లు వాలుతాయి.

ఆర్థికలాభం... యిది ఆహ్వానించదగిన, ఆనందకర అంశం... తర్వాత రాజకీయాలు... యిది బొత్తిగా అవసరంలేని విషయం... చివరిది స్త్రీసౌఖ్యం... ఇదొక్కటే కాస్త ఆలోచించాలి... అరుదుగా లభించే అవకాశం... సందేహ భరితం...

"అబ్బా! త్వరగా రండి టిఫిన్ చేద్దురుగాని టైం అవుతోంది" భార్య కేకతో ఈలోకంలోకి వచ్చాడు దివాకరం. ప్రతిరోజూ ఉదయాన్నే నిద్రలేవాలని అనుకొంటాడు. అదేంటోమరి ఎంత ట్రై చేసినా ఎనిమిది దాటందే మెలకువ రాదు.

గబగబా స్నానం కానిచ్చి, డ్రస్ చేసుకొని టిఫిన్‌కి కూర్చున్నాడు. అంతలో కొలీగ్ సుంద

టి. సురేశ్‌బాబు

రమూర్తి వచ్చాడు.

"సుందరం...! రా... రా! కూర్చో. ఏమోయ్..! మీ అన్నయ్యకు కూడా టిఫిన్ పెట్టు" అంటూ భార్యను పిలిచాడు దివాకరం.

"అబ్బే! వద్దులేరా! యింటివద్ద చేసి వస్తున్నా! చెల్లెమ్మా! టీ యివ్వమ్మా చాలు" అంటూ కూర్చున్నాడు సుందరం. అరవిందం టీ యిచ్చింది.

"ఆఁ... ఏంటిరా...యిలా రావడం?" అడిగాడు దివాకరం.

"మరేం లేదురా! నిన్న సాయంత్రం కొత్తగా బండి తీసాను... నిన్ను పికప్ చేసుకొని వెళ్దామని వచ్చాను" అన్నాడు సుందరమూర్తి.

"మరి చెప్పవేం... కంగ్రాట్స్! అయితే... యీవేళ గ్రహబలం నిజమయ్యింది" అరిచాడు దివాకరం.

"గ్రహబలం ఏమిట్రా?"

"అదేరా! ఈవేళ నాకు వాహనయోగం వుందని రాశిఫలాల్లో వుంది. అది యిపుడిలా నెరవేరబోతోంది కదా... అందుకని".

"ఇంకా యీ గ్రహబలాల పిచ్చి ఏమిట్రా?"

"దీని విలువ నీకు తెలియదురా"

"అదికాదురా! పత్రికల్లో జనరల్‌గా అందరికీ వర్తించే విధంగా వ్రాస్తుంటారు. వాటిని మాత్రమే విశ్వసించి మనం మన రోజువారీ కార్యక్రమాల్ని తయారుచేసుకోవడం అవివేకం కదా".

"నీతో వాదించడం కాదు. నా గ్రహబలాలు ఫలించి నేను ఏ లక్షాధికారినో, కోటీశ్వరుణ్నో అవుతాను... అప్పుడు చెబుదువుగాని పదపద" అంటూ లేచాడు దివాకరం.

"సార్! మిమ్మల్ని మేనేజర్‌గారు రమ్మంటున్నారు" అని అటెండర్ వచ్చి చెప్పడంతో మేనేజర్ ఛాంబర్‌లోకి అడుగుపెట్టాడు దివాకరం.

"రావోయ్ దివాకరం... కూర్చో. ఓ మంచి న్యూస్" అన్నాడు మేనేజర్. "చెప్పండి సర్" అంటూ ఎదురుగా కూర్చున్నాడు దివాకరం.

ప్రక్క చైర్లో ఓ అమ్మాయి... లేత చిలుకపచ్చ రంగు శారీ... అదే కలర్ బ్లౌజ్‌లో తలవంచుకొని కూర్చుని వుంది. చూపులు లాక్కొనే సౌందర్యం ఆమెది.

"నీకు అసిస్టెంట్ లేక వర్క్ చాలా ఎక్కువవుతోందని రోజూ అంటుంటావుకదా! అది యిక వుండదు".

"ఏమిటి సార్ మీరు అనేది?"

"అవునయ్యా! నీకు అసిస్టెంట్‌గా యీ అమ్మాయి జాయిన్ అయ్యింది".

"నిజమా సార్"

"అవును! యిదిగో... యీ అమ్మాయి మిస్ సుహాసిని. వర్క్ కాస్త అలవాటు అయ్యేవరకూ అవసరమయిన సజెషన్స్ యిస్తూ వుండు".


"అలాగే సార్"

"చూడమ్మా! సుహాసినీ... వీరు దివాకరం... నీవు వీరివద్దనే అసిస్టెంట్‌గా వర్క్ చేయాలి" అంటూ దివాకరాన్ని పరిచయం చేసాడు మేనేజర్.

"నమస్తే సర్" తియ్యగా పలికింది సుహాసిని కంఠం.

అనందంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు దివాకరం. ప్రతి నమస్కారం చేశాడు. సుహాసిని కిసుక్కున నవ్వి, కొంటెగా కన్ను కొట్టింది. అది మేనేజర్ చూడలేదు. ఏదేదో అయిపోయాడు దివాకరం.

ఇదేంటి...? యీ మిస్‌కి తొలిపరిచయం




లోనే తను యింతగా నచ్చాడా? ఏమో...? గ్రహబలం కావచ్చు. పైగా యీరోజు స్త్రీసౌఖ్యం అని వుందికదా!

"దివాకరం... పద! ఆఫీస్ స్టాఫ్ కంతా పరిచయం చేద్దాం" అంటూ మేనేజర్ లేవడంతో అతడితోబాటు ఆఫీస్‌లోకి వచ్చి అందరికీ సుహాసినిని పరిచయం చేశాడు దివాకరం.

తర్వాత మధ్యాహ్నం పరాంకుశంగారి లంచ్‌పార్టీ మొదలయ్యింది. అందరూ సరదాగా లంచ్ చేస్తున్నారు. సుహాసిని అందానికి ఆడవారు యీర్ష్య పడితే, మగవారంతా దివాకరం అదృష్టానికి కుళ్లుకున్నారు.

చూశావా బావా? గ్రహబలం అంటే యిదే! అర్థమయ్యిందా?" దివాకరం మెల్లగా సుందరమూర్తి చెవిలో అన్నాడు.

"చూద్దాం... నీ బల ప్రభావం" బదులిచ్చాడు సుందరమూర్తి.

పార్టీ అయ్యాక అంతా పరాంకుశానికి థాంక్స్ చెప్పి బయలుదేరారు. "వస్తాను సర్" అంది సుహాసిని దివాకరంతో అదే స్టయిల్లో కిసుక్కున నవ్వి, కొంటెగా కన్ను కొట్టి.

పరవశించిపోయాడు దివాకరం.

హుషారుగా యీలవేస్తూ మెల్లగా నడుచ్కుంటూ యింటికి వెళ్తున్నాడు దివాకరం. పార్టీ అయ్యాక టైంపాస్ కోసం ఆడిన పేకాటలో ఐదువందలదాకా వచ్చింది. ఆహా! తన గ్రహబలంలోని ఆర్థికలాభం కూడా నెరవేరింది! నిజంగా యీ రాశిఫలాలు వ్రాసిన మహానుభావుడికి చేతులెత్తి నమస్కరించాలి. ఇక మిగిలింది స్త్రీసౌఖ్యం మాత్రమే... దానికి కూడా రూట్ ఏర్పడింది. కాని ముందుకు ప్రొసీడ్ కావాలంటే ఏదో సంకోచం. మనసు ఏదో మూలనుంచి వెనక్కి లాగుతోంది.

అసలు ఆ నవ్వు చాలు... తిండి, నీళ్లూ లేకుండా ఎంతకాలమైనా వుండవచ్చు. అంతేనా... కొంటెగా కన్నుకొట్టడంలో రారమ్మని పిలిచే కోరిక దాగివుంది. దానిలోని నిగూఢార్థాలు తనవంటి రసికశిఖామణికి అర్థమవుతా

యిగానీ యితరులకు అర్థమవుతాయా? కావు! శభాష్ దివాకరం... జాగ్రత్తగా డీల్‌చేయి. మనసు పరిపరివిధాలా పోతుంటే తన్మయత్వంతో సాగిపోతున్నాడు.

ఎదురుగా... కొద్దిదూరంలో జనం గుంపులుగా వుండటం కన్పించింది. 'ఏం జరిగిందబ్బా' అనుకుంటూ తనూ జనాన్ని తోసుకుంటూ వెళ్లాడు. అక్కడ ఓ పహిల్వాన్ లాంటి వ్యక్తి యింకొకడ్ని ఈడ్చి కొడుతున్నాడు. చూస్తున్న వారిలో కొంతమంది కొట్టు... కొట్టు... అంటూ అరుస్తున్నారు.

అటూ యిటూ చూశాడు దివాకరం. అక్కడ ఓ పక్కగా తన కలలరాణి సుహాసిని... దివాకరాన్ని చూసి చిరునవ్వుతో కన్నుకొట్టింది. ఆహా!

"ఏంటి... మీరు యిక్కడ" అన్నాడు దివాకరం.

అంతలో పహిల్వాన్ లాంటి వ్యక్తి కొట్టడం ఆపి "జాగ్రత్త! మరోసారి యిలా వెకిలి చేష్టలు చేశావో..." అంటూ వదిలి సుహాసిని పక్కన దివాకరాన్ని చూసి "యీయనెవరు?" అని అడిగాడు.

"అన్నయ్యా! వీరు దివాకరం అని మా కొలీగ్. వీరి వద్దనే నేను అసిస్టెంట్‌గా పని చేస్తున్నా" అంది సుహాసిని పరిచయం చేస్తూ.

"అలాగా! గ్లాడ్ టూ మీట్ యూ సర్... అన్నట్లు నా పేరు వీరేశ్. సుహాసిని నా సిస్టర్" అంటూ చేయి కలిపాడు వీరేశ్.

"ఏం జరిగింది వీరేశ్‌గారూ!" అడిగాడు మెల్లగా దివాకరం.

"ఇంకా ఏం కావాలండీ... మా సిస్టర్‌కి ఓ వింత అలవాటు వుంది. కాస్త పరిచయం వున్నవాళ్లు కన్పిస్తేచాలు పలుకరింపుగా కిసుక్కున నవ్వడం, కొంటెగా కన్ను కొట్టడం... యీ అలవాటే నాకు తంటాలు తెచ్చిపెడుతోంది. ఇదిగో... యిపుడు తన్నులు తిన్నాడే... వీడు యిదివరకు పరిచయమే... అంతే యిది నవ్వడం... కన్ను కొట్టడం... వీడు ఏదేదో ఊహించుకొని, అవాకులూ చెవాకులూ పేలాడు. దాంతో నేను యిలా డీల్ చేశాను. అన్నట్లు మీరేమీ అనుకోనంటే ఓ విషయం... చెప్పడం ఆపాడు వీరేశ్.

"చెప్పండి" ముఖంపై పట్టిన చెమటను తుడుచుకుంటూ అడిగాడు దివాకరం.

"ఏం లేదు సర్... మీ ఆఫీస్‌లో దీని నవ్వుకు, చేష్టలకూ ఎవరయినా అపార్థం చేసుకుంటారేమో... కాస్త మీరు సర్ది చెప్పండి... నా వరకు తీసుకురాకుండా చూడండి... ప్లీజ్..." చేతులు పట్టుకొని అర్థించాడు వీరేశ్.

"భలేవారే... నేను వున్నానుగా" అప్రయత్నంగా మాటిచ్చాడు దివాకరం.

"థాంక్స్ సర్... యిక వుంటాం సర్" అంటూ సెలవు తీసుకొన్నాడు వీరేశ్, సుహాసినితో కలిసి. వెళ్లేముందు మరోసారి నవ్వింది కన్నుకొడుతూ సుహాసిని.

గుండె గుభేల్‌మంది దివాకరానికి. నీ నవ్వు బంగారంగానూ... నా అదృష్టం బాగుండి యింకా ముందుకు ప్రొసీడ్ కాలేదు. లేకుంటే యీ పహిల్వాన్ చేతిలో ముద్దగా మారిపోయి వుండేవాడిని...

నిజం... గ్రహబలం గ్రహబలం అంటూ దాని ప్రకారం గుడ్డిగా వెళితే ఎంత ప్రమాదకరం... రాశిఫలాలు వ్రాసేవారు మేధావులే కావచ్చు... కానీ వారు వ్రాసిన అన్ని ఫలాలూ మనకే జరుగుతాయని భావించి ఆ మత్తులోనే జీవితం కొనసాగించరాదు... భగవంతుడా రక్షించావు... థాంక్స్... ఆలోచనలతోనే ముందుకు సాగిపోయాడు దివాకరం. ●